# నాటకాన్ని గురించి

- మొదలి నాగభూషణశర్మ

ఒక ప్రముఖ సమకాలీన రాజకీయ నాయకుణ్ణి గురించి నాటకం రాయడం – అందులోనూ జీవితాంతం ప్రత్యర్థులతో నిరంతర సంఘర్షణల్ని కొనసాగించిన ప్రకాశం పంతులుగారి మీద నాటకం రాయడం – అసిధారా వ్రతమే!

ఒక పేదవాడు స్వయంకృషితో, ఆత్మీయతే ఆలంబనంగా పట్టుదలను పణంగా పెట్టి ఉన్నత శిఖరాలకు ఎదగడం ఎలా సాధ్యమో ప్రకాశంగారి జీవితం విస్పష్టం చేస్తుంది. అటువంటి సాధారణ వ్యక్తి జీవిక కోసం పెనుగులాడుతూనే ఉన్నతిని సాధించగలగడం, ఆ సాధనలో ఎందరో వ్యక్తుల ఆదరాభిమానాలను పొందడం, వాటిని జీవితాంతం మనసులో దాచుకుని, వారి యెడ తన కృతజ్ఞతను ప్రతినిత్యమూ చెల్లించడానికి ఉద్యుక్తుడు కావడమూ – ఇవి అన్నీ ప్రకాశం జీవితం మనకు చూపుతుంది. తల్లీ – కొడుకుల, గురువూ – శిష్యుల అన్యోన్య, ఆదర్శ సంబంధాలకు ప్రకాశం జీవితం ఒక మహత్తరమైన నిదర్శనం. ఈ విలువల విలువను ఈ తరం జనానికి చెప్పాలన్న ఆతృత యీ నాటకం రాయడానికి మొదటి కారణం.

తన సర్వస్వాన్ని దేశ స్వాతంత్ర్య సముపార్జన కోసం త్యాగం చేసిన మనీషి ఆయన. ఆ త్యాగానికి – వెనక ముందు ఆలోచించడం లేదు... పెళ్లాం బిడ్డల మాట తలపోయడం ఎరగడు... ఒంగోలు, రాజమండ్రి, మద్రాసుల్లో పెద్ద పెద్ద ఇళ్లు, ఊటీలో బంగళా, నెలకు ఏడెనిమిదివేలు సంపాదించే న్యాయవాద వృత్తి – ఇన్నింటినీ తృటిలో వదిలిపెట్టిన మనిషాయన... ఈ త్యాగానికి ఆయన వెలకట్టలేదు; దాన్ని గురించి తరువాత తరువాత గొప్పలు చెప్పుకోలేదు...

అటువంటి మహామహుల త్యాగనిరతివల్లే ఇవ్వాళ మనం యీపాటి స్వాంతంత్ర్యాన్నయినా అనుభవిస్తున్నాం. ఆ కృతజ్ఞతే నన్ను యీ నాటకం రాయించింది. అది రెండో కారణం.

'ఆంధ్రకేసరి' అన్నది ప్రకాశం సార్థక నామం. తుపాకి గుళ్లకు ఎదురొడ్డిన మొండి సాహసం ఆయనది. తాను నమ్మిన సిద్ధాంతాలకోసం గొప్పవాళ్లను కూడా సరకుచెయ్యని మొండి (మంచి) పట్టుదల ఆయనది. ఏభయ్ఏళ్లపాటు ప్రజలతో మమేకం అయిపోయి ప్రజలే ప్రకాశం, ప్రకాశమే ప్రజలు అనిపించుకోగలిగిన త్యాగమూర్తికి నివాళి యీ నాటకం.

రాజకీయాలు స్వార్థపూరితాలై, పెడమార్గాన పడుతున్న రోజుల్లో నైతిక, నిస్వార్థ రాజకీయాల కోసం తపించిన వ్యక్తి ప్రకాశంగారు. సిద్ధాంతాలను నిలుపుకోవడం కోసం పదవుల్ని కాలదన్నిన ధీరుడాయన. ఇవాల్టి రాజకీయ సంఘటనల్ని ఒక్క రాజకీయాలేకాదు – భారతీయ జన జీవనంలో ఏ భాగాన్ని తరచి చూచినా – స్వార్థ రాజకీయాలు – వాటికి అవసరమైన కుమ్మక్కులు, కుతంత్రాలు మనకు ప్రత్యక్షం అవుతున్నాయి. కాని వీటన్నిటికీ పునాదులు స్వాతంత్ర్యం రాకముందు నుంచే భారతదేశంలో వేళ్లూనుకున్నాయని ప్రకాశం జీవితచరిత్ర చదివితే మనకు అవగతం అవుతుంది. అవాంఛనీయ, అనైతిక శక్తుల ప్రాబల్యం ప్రకాశంగారు సాగించిన జీవిత సమరంలో మనకు ప్రత్యక్షం అవుతుంది. నిస్వార్థ రాజకీయాలకు ప్రతీక అయిన ప్రకాశంగారి మీద నాటకం

రాయలని నాకు బలంగా అనిపించడానికి మరో కారణం స్వార్థ రాజకీయ శక్తులు క్రమంగా అన్ని రంగాలలోనూ బలీయం అయి, సామాన్య మానవుడి వ్యక్తిత్వాన్ని నిర్వీర్యం చెయ్యడమే! అందువల్ల ఈ నాటకం ఆధునిక రాజకీయ నాటకంగా ఉద్దేశించబడ్డ చారిత్రక నేపథ్యం ఉన్న జీవితనాటకం. అంతేకాదు. తెలుగువాడి ఆత్మస్థైర్యానికి, పట్టుదలకు, ప్రేమించే ఆర్ద్రమైన మనసుకు, హరిస్తే ఎవ్వరినీ లెక్కచెయ్యనితనానికి – ఒక్క మాటలో చెప్పాలంటే – అసలుసిసలైన తెలుగుతనానికి బలీయమైన ప్రతీక ప్రకాశంగారి జీవితం.

ఈ నాటకం రాయడానికి – చాలా రోజులుగా నాలో జరుగుతున్న అంతర్మథనం మరొకటి కూడా కారణం. తెలుగువాళ్లు జాతీయ స్థాయిలో – ఏ ఒక్కరంగంలోనూ – నాయకత్వాన్ని సాధించలేకపోవడానికి గల కారణాలు ప్రకాశం సుదీర్ఘ రాజకీయ జీవితంలో అంతస్సూత్రంగా ఉన్నాయనిపిస్తుంది నాకు. ఆ కారణాలను విశ్లేషించుకొని, ఆ పరిస్థితులను అధిగమించి అత్యుత్తమస్థాయిలో గుర్తింపుపొందగల అవకాశాలను సృష్టించుకోవడం ఇప్పటికైనా అవసరం అంటూ తెలుగువారికి సమర్పించుకొనే వినతి పత్రం యీ నాటకం.

ప్రకాశం గారి ఆత్మచరిత్రలో కనిపించే చాలమంది చారిత్రక వ్యక్తుల్ని యీ నాటకంలోనూ ప్రవేశపెట్టాను. వారిని ఇందులో పాత్రల్ని చేసి, ప్రఖ్యాతిచెందిన మరికొందరి సరసన వారిని చేర్చి చరిత్రకు అద్దంపట్టే నేపథ్యాన్ని సృష్టించాను. ఇందులోని పాత్రలు మూడు తరగతులకు చెందినవారు. కొందరు ప్రసిద్ధులయిన చారిత్రక పురుషులు. మరికొందరు నామమాత్రంగా తెలిసి యీ చరిత్రలో భాగస్వాములయినవారు, మరికొందరు ఇందులో యిమడగల వ్యక్తిత్వం ఉన్నవారు. వీరి సమాహార రూపమే యీ నాటక పాత్రల చరిత్ర.

ఈ చారిత్రక స్పృహను కలగచేయడంలో కొందరు ప్రముఖుల్ని పాత్రలుగా ఎన్నుకున్నా, వారి పాక్షిక చిత్రణమే ఇందులో కనిపిస్తుంది. ఈ ప్రఖ్యాత రాజకీయ నాయకుల ప్రమేయం యీ నాటకంలోను, ప్రకాశం జీవితంలోను ఏయే సంఘర్షణాత్మక సంఘటనల్లో ఉందో వాటిని మాత్రమే ఎంచుకుని ఆ సంఘటనల పూర్వాపరాలను సృష్టించుకొని వాటిని నాటకీకరించాను. కేవలం నా నాటక అవసరాలకు మాత్రమే అలా చేయవలసి వచ్చిందనీ, ప్రకాశంగారి మీద నాటకం రాస్తే – ఆయనే ఆసాంతమూ ముఖ్యపాత్ర ధరిస్తాడు కనుక – మిగిలిన అనేక పాత్రల పాక్షిక చిత్రణం అనివార్యమనీ పాఠకులు గమనించగలరనుకుంటాను. అలా పాక్షిక చిత్రణ చేయవలసివచ్చిన రాజకీయనాయకులంటే నాకుకూడా భక్తి, శ్రద్ధలున్నాయని మాత్రమే నేను ఇక్కడ చెప్పవలసిన విషయం.

ఇటువంటి రాజకీయ నాటకాలలో పాత్రల్ని చిత్రించేటప్పుడు మరొక విమర్శ వచ్చే అవకాశం ఉంది. నిత్యజీవితంలో మనకు తెలిసిన వ్యక్తులు, యీ నాటకంలో చిత్రింపబడిన వ్యక్తులు ఒకరుగా ఊహించడం కొంచెం కష్టమే!.... పట్టాభి, రాజాజీలను గురించి బాగా తెలిసినవాళ్లు – వారు అంత బహిరంగంగా సంఘర్షణలకి దిగి పోట్లాడే రకం మనుషులు కారు – అంటారు... నిజమే! కాని నాటకంలో ఇద్దరు వ్యక్తుల మధ్య సంఘర్షణ లేదా రెండు విభిన్న ప్రవృత్తుల మధ్య సంఘర్షణను, రెండు భావాల మధ్య ఉన్న సంఘర్షణను నాటకీకరించేటప్పుడు యీ విధమైన పాత్రల ప్రవృత్తిని, అంతరంగాన్ని, దృక్పథాన్ని బట్టి ఒక్కొక్కప్పుడు వారిచేత సన్నివేశాలకు అనువుగా మాట్లాడించక తప్పదు. ఇది నాటకావసరం.

అలానే మరికొన్ని పాత్రల్ని నిత్య జీవితంలో ఎరిగివున్న వారు – "అయ్యో! వీళ్లు నిజజీవితంలో యిట్లా లేరు; యిట్లా మాట్లాడలేదు" అని పెదవివిరిచి "యీ పాత్రల్ని మార్చాలి – మరొకర్ని వాళ్లకి ప్రత్యామ్నాయంగా

ఉంచాలి” అని చాలా బలంగా, ఆవేశపూరితంగా భావించడానికి అవకాశం ఉంది. ఉదాహరణకి – కంచుమర్తి రామచంద్రరావుగారిని ఈనాటకానికి ఒక కథకునిగా ఎన్నుకొన్నాను. ఆయన గొప్ప జమీందారు. ఒక మిత్రుడన్నట్లు 'అసూర్యంపశ్య'. ఆయనను మిగిలిన వాళ్లు “ఏరా, ఒరే!' అనడం మనకు నచ్చదనుకోండి. అది చారిత్రకనేపథ్యం దృష్ట్యా సంభావ్యమా కాదా అని చూడాలి కాని, నూటికి నూరుపాళ్లు ఇలానే జరిగిందా అనే ప్రశ్న ఉదయించకూడదు. నాటకంలో possibility కన్నా probability కే పెద్దపీటవేస్తారు విమర్శకులు.

అలాగే నాటకావసరాల కోసం చాలా సన్నివేశాలను నేను సృష్టించుకొన్నాను. వాటి బీజాలు మాత్రం 'నా జీవిత యాత్ర'లోనే ఉన్నాయి. ప్రకాశంగారి చివరి రోజుల్లో సూర్యకుమారి ఆయన్ని చూడ్డానికి వచ్చిందా? – అని ప్రశ్నించే వాళ్లకి సమాధానం – “రాలేదు, నేనే రప్పించాను” అని. ప్రకాశంగారు ప్రత్యర్థులతో విభేదించిన అన్ని అంశాలను ఆయన ఆత్మచరిత్ర నుంచే గ్రహించాను. అయితే నేను చేసిందల్లా ఆ సంఘర్షణల్ని నాటక సంఘర్షణాలుగా మలచడానికి వీలుగా వేరువేరు ప్రదేశాల్లో, వేరువేరు కాలాల్లో జరిగిన సన్నివేశాల్ని ఏకీకృతం చేయడమే! ఇది చారిత్రక నాటకాల సన్నివేశ రూపకల్పనలో సర్వే సర్వత్రా పాటించే పద్ధతే! అందుకే ఇది చారిత్రక నేపథ్యంలో, చారిత్రక పాత్రలు పాల్గొనే ఒక జీవిత చిత్రణ. ఇది చారిత్రక నాటకం, డాక్యుమెంటరీ నాటకం కాదు.


కొందరు మిత్రులు దీనిని డాక్యుమెంటరీ నాటకం అని ముందుగానే తమకు తాముగా ధృవీకరించుకుని, డాక్యుమెంటరీ నాటకంలో లాగా “ఆ పాత్రలు, సన్నివేశాలు అట్లా లేవే!” అని సందేహించారు. వారందరికీ చెప్పవలసింది ఒక్కటే: ఇది డాక్యుమెంటరీ డ్రామాకాదు. చారిత్రక నాటకం. డాక్యుమెంటరీ డ్రామాలో సంఘటనల్ని యథాతథంగా చిత్రీకరిస్తాం. పాత్రల ప్రతి చర్యా మనకు అవగతం అయి, ఆ పాత్రల అస్తిత్వం మన అనుభవాలకు లోబడి వుండాలి. చారిత్రక నాటకంలో పాత్రల, సంఘటనల మూలాలు చరిత్ర నుంచి గ్రహించినవే! కాని చారిత్రకత చెడిపోకుండా, అది ఇనుమడించేలా ఆ సన్నివేశాల రూపకల్పన చేయడం చారిత్రక నాటకావసరం. చారిత్రక నాటకంలో ఆయావ్యక్తుల మనస్తత్వాలను ఆయా సంఘర్షణలు రూపుకడుతున్నాయా లేదా అన్న విచక్షణ ముఖ్యం. ఆ నియమిత నేపథ్యంలో ఇలానే జరిగివుండాలి – అని ప్రతి సన్నివేశాన్ని గురించి పాఠకులు అనుకోవాలి.

ఈ చారిత్రక స్పృహ – దీనిని 'చారిత్రకత' (Historicity అందాం.) ప్రతిబింబించే విధంగా రాసిన “ఎపిక్ ప్లే” (కావ్య నాటకం) ఇది. “ఎపిక్ ప్లే” లో అంతర్లీనంగా ఉండే లక్షణాలు ఇందులో చాలా ఉన్నాయి. నాటకం సంఘటనాత్మకం. అంతస్సూత్రంగా ఉండే వ్యక్తి చరిత్రను క్రమానుసారంగా ప్రతి సన్నివేశంలోను చిత్రించడం (ఎపిసోడిక్) దీనికి మూల లక్షణం. ఆ సంఘటనల మీద రచయిత వ్యాఖ్యానాన్ని కథనం ద్వారా చెప్పడం, తద్వారా చారిత్రక పరిణామాల్ని దృశ్యమానం చేస్తూనే ఆధునిక జీవితం మీద అవగాహనను కలగచేయడం, చరిత్రను వ్యాఖ్యానిస్తూ ప్రేక్షకుల, పాఠకుల దృష్టిని మౌలిక జీవన సత్యాల వైపుకు మళ్లించడం వంటి అంశాలను అవసరమైనంత మేరకు ఈ నాటకంలో వాడుకోవడం జరిగింది. కథనం, పాటలు, పద్యాలు, ప్రొజెక్షన్స్ వంటివి కేవలం కథను సుగమం చేయడానికే కాక, సన్నివేశాల మీద వ్యాఖ్యలు చెయ్యడానికి కూడా ఉపయోగించడం జరిగింది. అందువల్ల నాటకంలోని సంఘటనలు ఎంత ముఖ్యమైనవో, కథనం కూడా అంతముఖ్యమైనదే – నా దృష్టిలో.

ఈ నాటకం రాయడానికి ఆంధ్రదేశంలో జాతీయోద్యమంమీద, ప్రకాశంగారిమీద వచ్చిన దాదాపు అన్ని రచనలూ చదివాను. ఆయన జీవితాన్ని దగ్గరగా గమనించిన వారిని కలిశాను. ఆయన జీవిత సంఘటనలను ఇతిహాసాలుగా చెప్పుకొనేవారి పులకింతలు చూశాను. వారి వారి అనుభవాలు, అనుభూతులు ప్రాయికంగా నన్ను ప్రభావితం చేశాయి. వారందరికీ కృతజ్ఞతలు.

నాటక రచన ఒక ఎత్తు. దానిని ప్రదర్శించడం మరొక ఎత్తు. 45 మంది నటీనటులతో, 15 మంది సాంకేతిక బృందంతో ఆంధ్రదేశంలో చాలా పట్టణాలలోను, ఢిల్లీలోను యీ నాటకాన్ని దిగ్విజయంగా ప్రదర్శించింది రసరంజని. ఈ విజయం వెనుక ఎందరో వ్యక్తులున్నారు. తెరవెనుక నిరంతరం వెన్నుతట్టి నిలబడ్డ రసరంజని సూత్రధారులున్నారు. సాంకేతిక నిపుణులున్నారు. తెర ముందు నటీనట బృందం ఉంది. వీరిలో ప్రతి ఒక్కరూ యీ నాటక విజయానికి దోహదం చేశారు. నాటక పూర్వభ్యాసాల సమయంలోను, ప్రదర్శనల సమయాల్లోను మా నట, సాంకేతిక బృందంలోని ప్రతిఒక్కరిలోనూ కనిపించిన ఆత్మీయ, ఏక కౌటుంబిక భావం నన్ను వాళ్లయెడ మరీ కృతజ్ఞుణ్ణి చేసింది.


ఆంధ్రదేశం గర్వించదగ్గ ఒక మహామహుడి జీవితాన్ని నాటకంగా రాయగలగడం, దాన్ని నలుమూలలా ప్రదర్శించే వీలుకలగడం ఒకగొప్ప జీవితానుభవంగా భావిస్తాను. అందుకు సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.




అక్కినేనిచే గోల్డ్‌మెడల్ బహూకరణ ఉత్సవం, చిత్రంలో డా. కె.వి. రమణాచారి




చిందు భాగవతం కళాకారులతో....



కూచిపూడి నాట్యోత్సవాల నిర్వహణలో



గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు 'కళారత్న' పురస్కారంతో మొదలిని గౌరవించారు.
చిత్రంలో పర్యాటకశాఖామంత్రివర్యులు భూమా అఖిలప్రియగారు, ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌గారు



'ఆధునిక సిద్ధేంద్రయోగి' వెంపటి చినసత్యంగారితో...